నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, శనివారం 22 జూన్ 2024 | BHADRADRI KOTHAGUDEM

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా యోగా దినోత్సవం

యోగా కొందరిది కాదు.. అందరిది : ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో యోగా చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పండుగలా యోగా

మణుగూరులో ఆసనాలు వేస్తున్న సింగరేణి అధికారులు

పెనుబల్లిలో యోగా ఆకారంలో కుర్చొన్న విద్యార్థినులు

ఖమ్మం/ఖమ్మం సిటీ, జూన్ 21 : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా శుక్రవారం పండుగలా నిర్వహించారు. విద్యాసంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో యోగా ప్రాధాన్యతను వివరిస్తూ వయసుతో నిమిత్తం లేకుండా ఆసనాలు వేశారు. యోగాతోనే ఆరోగ్యం, మానసిక ప్రశాంతత అంటూ నిర్వాహకులు అవగాహన కల్పించారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లా ఆయుష్, యువజన క్రీడల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా దినోత్సవాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్‌తో కలిసి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగా కొందరిది కాదని.. ఇది అందరిదని, కులం, మతం, వర్గం, భాషకు సంబంధించింది కాదని, ఏళ్ల నుంచి తరతరాలుగా వస్తున్నదని పేర్కొన్నారు. పెద్దలు ఇచ్చిన ఆస్తిగా యోగాను కలెక్టర్ అభివర్ణించారు. మనందరం ఆరోగ్యంగా ఉండాలంటే శారీరక శ్రమ ఒక్కటే సరిపోదని, మానసికంగా కూడా ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఆందోళనలు మానసిక ఒత్తిడి తగ్గించుకోవడానికి యోగాసనాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. వివిధ రకాల వ్యాయామాలతో మానసిక దృఢత్వాన్ని పొందుతామని, తద్వారా పూర్తి ఆరోగ్యంగా జీవిస్తామన్నారు. సమయం కుదరడం లేదని తప్పించుకోవడం సరికాదని, పరిస్థితిని బట్టి ఒకటి, రెండు నిమిషాలు కూడా యోగా చేయవచ్చన్నారు.

2024 సంవత్సరానికి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని యోగా ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీగా చెప్పారని, అందుకే ప్రతి ఒక్కరూ ఈరోజు నుంచి క్రమం తప్పకుండా ఎంతో కొంత సమయం యోగా కోసం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో సునీల్ రెడ్డి, లక్ష్మీనారాయణ, డాక్టర్ రాంచందర్ రావు, డాక్టర్ రవికుమార్, అర్బన్ తహసీల్దార్ స్వామి, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం రూరల్ : గురుదక్షిణ ఫౌండేషన్‌లో..

అన్నపురెడ్డిపల్లిలో యోగా చేస్తున్న పంచాయతీ సిబ్బంది

విత్తన బిల్లులను భద్రపర్చుకోవాలి

విత్తన దుకాణంలో రికార్డులను చూస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

- రైతులకు దుకాణాదారులే అవగాహన కల్పించాలి
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- విత్తన, ఎరువుల షాపుల్లో ఆకస్మిక తనిఖీ

ఖమ్మం వ్యవసాయం, జూన్ 21 : విత్తనాలు, ఎరువుల కొనుగోలు బిల్లులను రైతులు పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరచుకునేలా దుకాణాదారులు వారికి అవగాహన కల్పించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని బర్మాషెల్ రోడ్డు, గాంధీచౌక్‌లోని లక్ష్మీ వెంకట రమణ సీడ్స్, ఉషశ్రీ మార్కెటింగ్ ఏజెన్సీ, లక్ష్మీ మణికంఠ ఏజెన్సీ విత్తన, ఎరువుల షాపులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విత్తనాల ఖాళీ ప్యాకెట్లను కూడా సీజన్ పూర్తయ్యే వరకు రైతులు భద్రపర్చుకోవాలని సూచించారు. షాపుల్లో ఉన్న విత్తనాలు, స్టాక్‌బోర్డులో ఉన్న వివరాలను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్, ఇన్వాయిస్ బుక్, బిల్‌బుక్స్, విత్తన బస్తాలపై లాట్ నెంబర్లు, ఎంఆర్‌పీ, బ్యాచ్ నెంబర్, గడువు తేదీ తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. షాపు అనుమతి పత్రాలను పరిశీలించి దుకాణాదారులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇతర షాపులకు అమ్మినవి, రైతులకు నేరుగా అమ్మినవి వేర్వేరుగా రిజిస్టర్లు నిర్వహించాలన్నారు. రైతులు ఏఏ ప్రాంతాల నుంచి వస్తున్నారు.. ఏఏ రకాలు అడుగుతున్నారు.. జిల్లాలో ఏఏ కూరగాయలు పండిస్తారో తెలుసుకోవాలని, పూలసాగు, మార్కెటింగ్ పొజీషియన్ సందర్శనలు చేపట్టాలని, సాగులో సక్సెస్ అయిన రైతుల అనుభవాలను తెలుసుకొని ఇతర రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అనుమతి లేకుండా గ్రామాల్లో విత్తనాలు విక్రయించే వారి సమాచారాన్ని రైతులే అధికారులకు తెలియజేయాలని కోరారు. విత్తనాల కొనుగోలుకు వచ్చిన రైతులతో షాపుల వద్ద కలెక్టర్ కాసేపు ముచ్చటించారు. ఏఏ పంటలు సాగు చేస్తున్నారు.. షాపుల్లో ఎంఆర్‌పీ కంటే ఎక్కువగా అమ్ముతున్నారా? వంటి విషయాలపై ఆరా తీశారు. వ్యవసాయశాఖ అధికారులు షెడ్యూల్ ప్రకారం ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని ఆదేశించారు. నూతన వ్యవసాయ పద్ధతులపై రైతులకు రైతువేదికల్లో నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎం.విజయనిర్మల, ఏడీఏ శ్రీనివాసరావు, ఖమ్మం అర్బన్ మండల ఏవో కిషోర్‌బాబు ఉన్నారు.

గంజాయి రవాణా కట్టడికి చర్యలు

- సరిహద్దు చెక్‌పోస్టుల్లో విస్తృతంగా వాహనాల తనిఖీ
- అడ్డాలుగా ఉన్న పాన్ డబ్బాలపై ప్రత్యేక నిఘా
- గంజాయి కేసుల వీసీలో ఖమ్మం సీపీ సునీల్‌దత్

మామిళ్లగూడెం, జూన్ 21: జిల్లాలో గంజాయి రవాణా కట్టడికి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని సీపీ సునీల్ దత్ ఆదేశించారు. 'మాదకద్రవ్యాలు, గంజాయి సరఫరా, చట్టవ్యతిరేక కార్యకలాపాలు అడ్డుకొనేందుకు తీసుకోవాల్సిన చర్యలు, పెండింగ్ గంజాయి కేసుల సమీక్ష'పై జిల్లాలోని పోలీసు అధికారులతో ఖమ్మం నుంచి శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. సరిహద్దు చెక్‌పోస్టుల్లో వాహనాల విస్తృత తనిఖీల ద్వారా గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేయగలమన్నారు. రైలు మార్గాలతోపాటు రోడ్డు రవాణా సదుపాయాలు ఉన్న సరిహద్దు రాష్ట్రాల నుంచి జిల్లా మీదుగా ఇతర రాష్ట్రాలకు గంజాయిని తరలించే అవకాశం ఉందన్నారు. అందుకని ఈ అక్రమ రవాణాపై స్థానిక పోలీసులతోపాటు టాస్క్ ఫోర్స్ పోలీసులు కూడా దృష్టి సారించాలని సూచించారు. సరఫరా మూలాలను కనిపెట్టి వ్యాపారులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఆదేశించారు. వినియోగదారుల నుంచి విక్రయదారుల వరకు సరఫరా లింకులపై డేగ కన్ను వేసి ఉంచాలన్నారు. ఉపాధి కోసం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు, విద్యార్థులు, యువకులను కొందరు గంజాయి స్మగ్లర్లు ఆసరాగా చేసుకున్నారని అన్నారు. వారికి గంజాయిని అందజేసేందుకు పాన్ డబ్బాలను అడ్డాలుగా మార్చుకుంటున్నారని అన్నారు. అందుకని ఆయా అడ్డాలపై నిఘా పెట్టాలని ఆదేశించారు. గంజాయి మత్తుకు అలవాటైన యువకులు, కార్మికులు.. తమ స్నేహితులతో కలిసి పట్టణాల శివారు ప్రాంతాల్లో దమ్ము కొడుతున్నారని అన్నారు. అందుకని శివార్లలో నిఘా పెంచి గంజాయి దమ్ముకొడుతున్న వారిని అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు. అలాగే, కళాశాలల్లోకి ఈ విష సంస్కృతి విస్తరిస్తే ఒక విద్యార్థిని చూసి మరొక విద్యార్థి గంజాయికి అలవాటుపడే ప్రమాదముంటుందని అన్నారు. కాబట్టి క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం వల్ల జరిగే దుష్పరిణామాల గురించి స్కూళ్లు, కాలేజీలు, పబ్లిక్ ప్రదేశాల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎస్‌బీ ఏసీపీ ప్రసన్న కుమార్, సీఐలు స్వామి, రామకృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఖమ్మం సీపీ సునీల్‌దత్

యోగా శిక్షణ పొందుతున్న పోలీస్ అధికారులు

పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో యోగాసనాలు

యోగాతో శారీరక, మానసిక, ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని యోగా గురువు వీ.సురేశ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఖమ్మంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో అభ్యాసన కార్యక్రమంలో పోలీసు సిబ్బంది యోగాసనాలు సాధన చేశారు. ఈ సందర్భంగా యోగా గురువు మాట్లాడుతూ.. యోగా అనేది భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక అభ్యాసమని వివరించారు. ఆర్ఐలు కామరాజు, శ్రీశైలం, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై తక్షణమే స్పందిస్తా..

పెండింగ్‌లో లేకుండా సమస్యలన్నీ పరిష్కరిస్తా..

వరద బాధితులకు అండగా ఉంటా.. ప్రాణనష్టం జరగనివ్వం

పునరావాస కేంద్రాల్లో ఉండేవారికి మహిళా సంఘాల ద్వారా భోజనాలు

సర్కారు బడులకు కొత్తరూపు.. వ్యవసాయరంగంలో వినూత్న మార్పులు

పకడ్బందీగా ఏజెన్సీ చట్టాల అమలు.. విద్యావైద్యంపై ప్రత్యేక దృష్టి

'నమస్తే తెలంగాణ'తో భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేశ్ వి పాటిల్

"జిల్లా ప్రజలకు ఎలాంటి సమస్య ఉన్నా తక్షణమే స్పందించి పరిష్కరిస్తాను.. గిరిజన జిల్లాలో పనిచేసే అవకాశం రావడం నా అదృష్టం.. పూర్తి అవగాహనతో ఏజెన్సీ చట్టాల పకడ్బందీ అమలుకు కృషిచేస్తా.. సర్కార్ బడులకు కొత్త రూపు తీసుకొస్తా.. గోదావరి పరీవాహక ప్రాంతం కావడంతో ముంపు సమయంలో వరద బాధితులకు అండగా ఉంటా.. ఇందుకోసం సరికొత్త ప్రయోగాన్ని చేయబోతున్నా.. పునరావాస కేంద్రంలో ఉండేవారికి మహిళా సంఘాల ద్వారా భోజనం తయారు చేయించి సమయానికి అందిస్తాను.. ఆపద సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడడమే ఏకైక లక్ష్యంగా పనిచేస్తా" అని భద్రాద్రి కొత్తగూడెం కొత్త కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రం కొత్తగూడెంలోని కలెక్టరేట్‌లో 'నమస్తే తెలంగాణ'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను చెప్పుకొచ్చారు.

- భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 21 (నమస్తే తెలంగాణ)

నమస్తే : ఏజెన్సీ ప్రాంతంలో పనిచేయడం ఎలా ఉంది?

కలెక్టర్ : గిరిజన జిల్లాలో పనిచేసే అవకాశం నాకు రావడం చాలా అదృష్టంగా భావిస్తున్నాను. పేదవారికి సాయం చేయడంలో చాలా సంతోషం ఉంటుంది. గిరిజనులను అభివృద్ధి వైపు తీసుకెళ్తా.. వారికి అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తా.. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి సాయం వారికి అందజేస్తా.. సంక్షేమ పథకాల ఫలాలు చేరవేస్తా. ప్రభుత్వ ఉద్యోగుల బయోమెట్రిక్ ముఖ్యంకాదు.. ఒక్క ఫైల్ కూడా పెండింగ్‌లో లేకుండా చూడడమే నా కర్తవ్యం.

నమస్తే : గోదావరి వరదలను ఎలా ఎదుర్కొంటారు?

కలెక్టర్ : వరదల గురించి తెలుసుకున్నాను. భద్రాచలం కరకట్ట వద్ద స్లూయీస్ నుంచి నీరు లోపలికి వస్తుంది. అక్కడ నీరు రాకుండా రెండు, మూడు మోటర్లను అందుబాటులో ఉంచుకుంటాం. వరద ముంపు లేకుండా చూస్తాం. వరదల్లో చిక్కుకుంటే కొత్తగా డ్రోన్ ద్వారా రోప్‌ను అందించి ప్రాణనష్టం లేకుండా చూడాలని ప్లాన్ చేస్తున్నాం. పునరావాస కేంద్రాల వద్ద ఉన్నవారికి సమయానికి భోజనం అందజేయడం కోసం మహిళా సంఘాలను ఉపయోగించుకుంటాం.

నమస్తే : విద్య, వైద్యరంగ సమస్యలను ఎలా అభిగమిస్తారు?

కలెక్టర్ : విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాను. ఇప్పటికే కొన్ని పాఠశాలలను పరిశీలించాను. మా ఫ్యామిలీలో టీచర్లు ఉన్నారు. అందుకే వాళ్ల గురించి తెలుసు. అమ్మ ఆదర్శ పాఠశాలలకు వచ్చిన నిధులను ఉపయోగించి ఆధునీకరణ చేయిస్తాను. పెండింగ్‌లో ఉన్న పనులు కూడా పూర్తి చేయిస్తా. జిల్లా పెద్దాసుపత్రిలో రోగులకు కనీస సౌకర్యాలు కల్పిస్తాం. అవసరమైన మందులను సరిపడా అందుబాటులో ఉంచుతాం. ప్రధానంగా తాగునీరు, విద్యుత్ సమస్య రానివ్వం.

నమస్తే : మరి వ్యవసాయం సంగతేంటి?

కలెక్టర్ : వ్యవసాయం గురించి నాకు అవగాహన ఉంది. రైతులు ఎప్పుడూ వరి, జొన్నలు మాత్రమే వేస్తున్నారు. దిగుబడి రానప్పుడు పంట మార్చాలి. మునగ పంటను వేయాలని సూచించాను. రైతులకు అవగాహన కల్పించి దిగుబడి వచ్చే పంటలను పండించేలా చూస్తాను. లాభసాటి పంటలను వేసుకునేలా అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ ఏడాది పంటల్లో మార్పులు తీసుకొస్తున్నాం. ఇప్పటికే ఆ శాఖ అధికారులతో సమీక్ష చేశా.

నమస్తే : ధరణి సమస్యలకు పరిష్కారం లభిస్తుందా?

కలెక్టర్ : పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులన్నీ క్లియర్ చేస్తాం. ఏజెన్సీ కావడం వల్ల కొన్ని సమస్యలు ఉన్నాయి. వాటిని త్వరలో పరిష్కారం చేయడానికి ప్రయత్నిస్తాను. ఇప్పుడిప్పుడే జిల్లాలో పర్యటించి సమస్యలను తెలుసుకుంటున్నాను. తెలుసుకున్నాక స్పీడప్‌గా పనులు అవుతాయి. ఎక్కడా పెండింగ్ ఉండవు.

నమస్తే : భద్రాద్రి జిల్లాపై మీ అభిప్రాయం?

కలెక్టర్ : ఎంతో చరిత్ర కలిగిన జిల్లా ఇది. రాష్ట్రంలోనే పెద్దది. పవర్‌ఫుల్ జిల్లా.. పవర్ కూడా ఇక్కడే ఉంది. కిన్నెరసాని, చప్పట్లబావి, భద్రాచలం, రథంగుట్ట వంటి పర్యాటక ప్రాంతాలున్నాయి. ఇంకా జిల్లా విశిష్టత గురించి నాకు తెలియజేస్తే దానిపై దృష్టిపెట్టి బయట ప్రపంచానికి తీసుకెళ్తాను. ఇల్లెందు క్రాస్‌రోడ్‌లో ఉన్న టూరిజం హోటల్‌ను ఆధునీకరిస్తాను. అందరినీ సమన్వయం చేసుకుని అభివృద్ధిలో ముందుకుపోవడమే నా లక్ష్యం.

'ఆయిల్‌పాం'లో ఆదివాసీలకు ప్రోత్సాహం

నేషనల్ బయో డైవర్సిటీ చైర్మన్ అచ్లేందర్‌రెడ్డి వెల్లడి

దమ్మపేట, అశ్వారావుపేటలో తోటలను సందర్శించిన సాంకేతిక బృందం

ఆయిల్‌పాం తోటలపై అధ్యయనం చేస్తున్న ఐఎఫ్ఎస్ అధికారులు

అశ్వారావుపేట, జూన్ 21 : దీర్ఘకాలిక నికర ఆదాయం అందించే ఆయిల్‌పాం సాగు వైపు ఆదివాసీ రైతులను ప్రోత్సహించనున్నట్లు నేషనల్ బయో డైవర్సిటీ చైర్మన్ అచ్లేందర్‌రెడ్డి, ఐఎఫ్ఎస్ అధికారులు కృష్ణమూర్తి, జయరాజ్‌లు స్పష్టం చేశారు. అందులో భాగంగానే ఆయిల్‌పాం సాగు పద్ధతులు, ప్రభుత్వ రాయితీ తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసినట్లు చెప్పారు. సాంకేతిక బృందంతో శుక్రవారం దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లో పర్యటించిన వారు.. ఆయిల్‌పాం తోటలను సందర్శించి రైతులతో మాట్లాడారు. సాగు విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. దమ్మపేట మండలం అల్లిపల్లి, మల్లారం, అశ్వారావుపేట మండలం అచ్యుతాపురం గ్రామాల్లో ఆయిల్‌పాం, అంతర పంట సాగును పరిశీలించారు. ఆయిల్‌పాం సాగు, యాజమాన్య పద్ధతులు, దిగుబడులు, రవాణా, ధర నిర్ణయం, రైతులకు చెల్లింపు, నర్సరీలో మొక్కల పెంపు తదితర వివరాల గురించి ఆయిల్‌ఫెడ్ డివిజనల్ ఆఫీసర్ ఆకుల బాలకృష్ణ వివరించారు. ఉద్యాన శాఖ ద్వారా మొక్కలు, తోటల నిర్వహణ, అంతర పంటలకు ప్రభుత్వం నుంచి మంజూరు చేస్తున్న సబ్సిడీ పథకాల గురించి డీహెచ్ఎస్‌వో సూర్యనారాయణ వివరించారు. అక్కడ నుంచి అప్పారావుపేట ఫ్యాక్టరీకి చేరుకుని ఆయిల్‌పాం గెలల క్రష్నింగ్, ఆయిల్ రికవరీ, ఉప ఉత్పత్తుల సేకరణ, మార్కెటింగ్ అంశాలను ఫ్యాక్టరీ మేనేజర్ కల్యాణ్ వివరించారు. అల్లిపల్లిలో ఆయిల్‌ఫెడ్ అడ్వైజరీ కమిటీ మెంబర్ ఆలపాటి రామచంద్ర ప్రసాద్‌తో సమావేశమై సాగు వివరాల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పాం సాగు వల్ల పర్యావరణానికి కలిగే లాభనష్టాలను కూడా అంచనా వేసినట్లు తెలిపారు. ఆయన వెంట ఐఐవోపీఆర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఎంవీ ప్రసాద్, దమ్మపేట ఉద్యాన అధికారి సందీప్, ఆయిల్‌ఫెడ్ రిసోర్స్ పర్సన్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బొగ్గు గనుల వేలంపై నిరసన

నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైన కార్మికులు

బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని వ్యతిరేకించిన సీఐటీయూ, ఏఐటీయూసీ

టేకులపల్లి : మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కొత్తగూడెం సింగరేణి/టేకులపల్లి, జూన్ 21 : బొగ్గు బ్లాక్‌ల వేలంపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ, ఏఐటీయూసీ వాటి అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. కొత్తగూడెంలో సీఐటీయూ అనుబంధ సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మెయిన్ హాస్పిటల్, స్టోర్, మెయిన్ వర్క్‌షాప్ కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్ నడిబొడ్డులో బొగ్గు వేలంపాట నిర్వహిస్తున్నదని, ఇందులో మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియాలోని శ్రావణ్‌పల్లి సింగరేణి బొగ్గు బ్లాక్ కూడా ఉందని, ఇందుకు వ్యతిరేకంగా కార్మికులు స్పందించి చేపట్టిన నిరసన కార్యక్రమం విజయవంతమైందని బ్రాంచి అధ్యక్షుడు గాజుల రాజారావు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సూరం ఐలయ్య, నాజర్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే టేకులపల్లి మండలం కోయగూడెం ఉపరితల గనిలో ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బొగ్గు గనుల వేలాన్ని నిరసిస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అంతకుముందు మేనేజర్ సౌరభ్ సుమన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఫిట్ సహాయ కార్యదర్శి బాలాజీ మాట్లాడుతూ సింగరేణి సంస్థల పరిధిలో ఉన్న అన్ని బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థకే కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటనర్సయ్య, విజయ్‌కుమార్, రామకృష్ణాచారి, ఐలయ్య, వెంగళ రవి, ఎల్లబోయిన రంజిత్‌కుమార్, శ్రీరాములు, మనోజ్‌కుమార్, నాగేశ్వరరావు, భూక్యా నాగేశ్వరరావు, రాజు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కాలనీల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ, జూన్ 21 : కొత్తగూడెం నియోజకవర్గ ప్రజల ఆదరణ మరువలేనిదని, నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం, శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని గట్టాయిగూడెం, విద్యుత్‌కాలనీ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ప్రతి పేదవాడికి అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నానని అన్నారు. ప్రజలకు ఏ కష్టమొచ్చినా ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వివేక్, మున్సిపల్ కమిషనర్ స్వామి, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, ముత్యాల విశ్వనాథం, అడుసుమల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, సుధాకర్, కొండ వెంకన్న, పగిడిపల్లి మనోహర్ పాల్గొన్నారు.

అవగాహనతో సాగు చేస్తే దిగుబడులు

భద్రాద్రి డీఏవో బాబూరావు

టేకులపల్లి, జూన్ 21 : వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ పత్తి పంటపై అవగాహనతో సాగు చేస్తే రైతులు మంచి దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి(డీఏవో) వేల్పుల బాబూరావు అన్నారు. శుక్రవారం మండలంలోని తొమ్మిదో మైలుతండా గ్రామ పంచాయతీ పరిధిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో క్రాప్ బుకింగ్ వెరిఫికేషన్ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలువురు రైతులకు చెందిన పత్తి చేలను సందర్శించారు. మొక్కలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా కురిసిన వర్షాలతో పత్తి సాగు ప్రారంభ దశలో ఉన్నదని తెలిపారు. సాగు రైతులు ముందుగా నాణ్యమైన విత్తనాలను అధీకృత డీలర్ల వద్ద కొనుగోలు చేయాలని, పంట సాగుకు ముందు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. సాగుకు అనుకూలమైన భూముల్లో పత్తి పంట వేస్తే మంచిదిగుబడులు సాధించవచ్చన్నారు. తర్వాత రైతులకు పత్తి సాగుపై అవగాహన కల్పించారు. ఆయన వెంట ఏవో అన్నపూర్ణ, ఏఈవోలు శ్రావణి, విశాల, రైతులు ఉన్నారు.